కథ

కోర్టు నోటీసు

ఎల్ శాంతి
76800 86787

“హలో.. శేఖర్!” చాలా హడావుడిగా వినిపించింది తండ్రి గొంతు.

“చెప్పండి నాన్నా..” అన్నాడు శేఖర్.

“నువ్వు అర్జెంట్‌గా బయల్దేరి రా. చెల్లిని వెంటబెట్టుకు రా. ఈ పిచ్చిముండ ఏం చేసిందనుకున్నావ్? నాకు మతిపోతున్నది. చెప్పడానికి నోరు రావడం లేదురా. కంగారు పడకు.. మా ఆరోగ్యాలు బానే ఉన్నాయి. అదీ గుండ్రాయిలా బాగానే ఉంది. అయితే విషయం మాత్రం ఫోన్‌లో చెప్పలేను. నువ్వు రావల్సిందే! ఇంకో మాట.. ఇది మన నలుగురి మధ్యే ఉండాల్సిన విషయం. బయటికి తెలిస్తే అందరూ నవ్విపోతారు. కోడల్ని తీసుకురావద్దు. అలాగే బావకు ఏదో ఒకటి చెప్పి, చెల్లిని మాత్రమే బయల్దేరమను. పిల్లల్ని కూడా తీసుకురావద్దు. మహిత, నువ్వు మాత్రమే రండి!” కచ్చితంగా చెప్పాడు మాధవరావు.

“ఏమైంది నాన్నా? అమ్మ ఏం చేసింది? ఎందుకంత కంగారు?” శేఖర్ ఆందోళనగా అడిగాడు.

“అవన్నీ ఫోన్‌లో చెప్పలేను. మీరు రండి” కొడుక్కి నచ్చజెప్పాడు మాధవరావు.

“సరే నాన్నా! చెల్లిని తీసుకొని బయల్దేరుతా” అని ఫోన్ పెట్టేశాడు శేఖర్.

బెంగళూరు నుంచి ఆరోజు రాత్రే బయల్దేరి, ఉదయానికల్లా విశాఖ ఎంవీపీ కాలనీలోని తల్లిదండ్రుల ఇంటికి చేరుకున్నారు అన్నాచెల్లెళ్లిద్దరూ.

సోఫాలో కూర్చొని ఉన్నాడు మాధవరావు.

“అమ్మ ఏది నాన్నా!?..” అంటూ కంగారుగా అన్ని గదుల్లోకి తిరిగారు శేఖర్, మహిత.

రాధిక వంటింట్లో ఉంది. ఏం వండుతున్నదో.. ఇల్లంతా ఘుమఘుమల వాసన.

‘ఇద్దరూ బాగానే ఉన్నారే! ఎందుకు పిలిచారంటావ్!?’ అన్నట్టు అన్నాచెల్లి ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

“మహీ.. శేఖర్! వెళ్లి స్నానాలు చేసి రండి. మీకిష్టమని ఉప్మా పెసరట్టు చేశాను. అంతా కలిసి తిందాం. త్వరగా రండిరా!” అని ఆప్యాయంగా బిడ్డలిద్దరికీ చెప్పింది రాధిక.

“అమ్మా.. ఏమైందో నువ్వయినా చెప్పు! నాన్న సగం సగం మాట్లాడుతున్నారు” తల్లిని అడిగింది మహి.

సమాధానం చెప్పకుండానే..

“పిల్లలు బాగున్నారా? మొన్నటి సున్నుండలు ఉన్నాయా.. అయిపోయాయా? సాయంత్రం పిండి కలిపి తయారుచేస్తాను. పట్టుకెళ్దువు గానీ” అంటున్న అమ్మవైపు అసహనంతో చూసింది కూతురు.

వెళ్లి ఇద్దరూ ఫ్రెషప్ అయి వచ్చారు.

అందరూ డైనింగ్ టేబుల్ దగ్గరికి చేరారు.

మాధవరావు చిరచిరలాడుతూ.. కుర్చీని బరబరా లాక్కొని కూర్చున్నాడు.

“నాన్నా.. అమ్మా! మాకు ఏమీ తినాలని లేదు. ముందు ఏమైందో చెప్పండి?” అడిగింది మహి.

“ఏం చెప్పమంటావురా? బయటికి కక్కాలంటేనే అవమానంగా ఉంది. ఈ పిచ్చి..” అని మాధవరావు ఆగ్రహంతో మాట్లాడలేక, మధ్యలోనే ఆగిపోయాడు.

“అమ్మ ఏం చేసింది? వివరంగా చెప్పండి నాన్నా!” అడిగాడు శేఖర్.

“ఒరే.. ఏ భార్యా, ఏ భర్తకూ ఇవ్వని రిటైర్‌మెంట్ గిఫ్ట్ ఇచ్చిందిరా మీ అమ్మ నాకు. ఇదిగో చూడండి” అని లోపలి వెళ్లి, రాధిక తనకు విడాకులు కోరుతూ పంపిన కోర్టు నోటీసును తీసుకొచ్చి శేఖర్ చేతికిచ్చాడు మాధవరావు.

మహి, శేఖర్ ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

“అమ్మా! ఏంటిది? నమ్మలేకపోతున్నాం” గట్టిగా అన్నది మహి.

“నాన్న నిన్ను ఏమన్నా.. ఎప్పుడూ ఎదురు చెప్పవు. ఆయన అడుగులో అడుగేసి నడుస్తావు. మొన్న రిటైర్‌మెంట్ ఫంక్షన్ ఎంత ఘనంగా జరిగిందో కదా! పెళ్లిలా జరిగిందని అంతా మురిసిపోయారు” అన్నాడు శేఖర్.

“అవును.. మీరిద్దరూ అచ్చంగా రాధామాధవులేనని అందరూ ఎంత సంబరపడ్డారో! మనసు నిండా ఆనందోత్సాహాలతో ఆరోజు ఎంతో ఘనంగా జరుపుకొన్నాం. ఇంతలోనే ఏందమ్మా ఇది!” బాధగా అడిగింది మహి.

“ఏమోరా! ఆ నోటీసు చూసి నా మతిపోయింది. మీకే అలా ఉంటే.. నాకెలా ఉంటుందో ఆలోచించండి” మాధవరావు ఏడుపు ముఖం పెట్టుకొని కూర్చున్నాడు.

రాధిక ఏమీ మాట్లాడలేదు. కాసేపు అంతా నిశ్శబ్దం.

మళ్లీ మాధవరావు అందుకున్నాడు..

“ఆ రోజు ఈ నోటీసు చదివి నా గుండె ఆగినంత పనైంది. సోఫాలో దబీమని కూలబడ్డాను. వెంటనే పరుగెత్తుకు వచ్చి మంచినీళ్లు, బీపీ మాత్ర ఇచ్చింది. ఇదేం వింతరా.. దీన్ని ఇన్నాళ్లూ భరించినందుకు నేను కదా కేసు వేయాలి!” అన్నాడు.

“ఊరుకోండి నాన్నా!” అని మహి వారించింది.

“అమ్మ ఇలాచేసి ఉండదు. ఏదో పొరపాటు జరిగి ఉండొచ్చు!” అంటూ అమ్మవైపు చూశాడు శేఖర్.

రాధిక నోరు విప్పింది.

“సారీ రా. స్వయంగా నేనే ఆ నోటీసు పంపించాను” అన్నది స్థిరంగా.

“అమ్మా!” అంటూ నిర్ఘాంతపోయారు ఇద్దరు.

మాధవరావు తల బాదుకున్నాడు.

“ఏం? ఇప్పుడు ఏం కొంపలు మునిగాయని..” ముగ్గురివైపూ చూస్తూ అడిగింది రాధిక.

“ఈ విషయం బయటికి తెలిస్తే నా పరువు గంగలో కలిసిపోతుందన్న ఇంగితం కూడా లేదు. ఇంతా చేసి.. ఏమైందని ఎంత తాపీగా అడుగుతున్నదో చూశార్రా?” మాధవరావు దాదాపు అరిచి చెబుతున్నాడు.

“మీరు భోంచేయండి!” అంటూ.. తను తినడం పూర్తి చేసి, ప్లేటుతో సింకు దగ్గరికి నడిచింది రాధిక.

అన్నాచెల్లెళ్లకు అంతా అయోమయంగా ఉంది.

“అమ్మా! అలా వెళ్లిపోతావేం? ముందు దీని సంగతి చెప్పమ్మా, మాకు ఎంత బాధగా ఉందో తెలుసా?” మహి ఆవేదనగా అన్నది.

“బాధ పడకండమ్మా! నేనే నోటీసు పంపానని చెప్పాను కదా” అన్నది రాధిక, ప్లేటు టబ్‌లో పెడుతూ.

“అదే.. ఎందుకూ? ఎప్పుడూ నాన్నను పల్లెత్తుమాట అనని నువ్వు ఈరోజు ఎందుకిలా?”.

“ఆ విషయం మీ నాన్ననే అడగండి”.

“అదిగో.. పళ్లు రాలిపోతాయ్! ఒరే.. ఒట్టురా! మా మధ్య ఏ గొడవా జరగలేదురా! ఎప్పటిలాగే ఉన్నాం. సడన్‌గా ఏంటిది? అందుకే నాకు బుర్ర పాడైపోతుంది” చెప్పాడు మాధవరావు. మళ్లీ తనే..